క్లుప్తంగా

మహంకాళి ఆలయంలో చోరీ



విచారణ చేస్తున్న పోలీసు సిబ్బంది

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారంలో మంగళవారం అర్ధరాత్రి నూతనంగా నిర్మించిన మహంకాళి ఆలయం తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. బుధవారం ఆలయ నిర్వాహకులు అమ్మవారికి పూజలు చేయడానికి వెళ్లారు. ఆలయ తాళాలు పగులగొట్టి ఉండటంతో వెంటనే మిరుదొడ్డి పోలీసులకు సమాచారం అందించారు. ఆలయానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూఅమ్మవారికి అలంకరించిన రెండు ముక్కు పుడకలు, పుస్తె మెట్టెలు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లారన్నారు. చోరీపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బోయిని పర్శరాములు తెలిపారు.

పాము కాటుతో పాడి గేదె మృతి



పాడిగేదె కళేబరం

మిరుదొడ్డి(దుబ్బాక): పాముకాటుతో పాడిగేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో జరిగింది. రైతు బోయిని పెంటయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం తన పొలం వద్ద పాడిగేదెను కట్టేసి ఇంటికి వచ్చినట్లు తెలిపాడు. బుధవారం తెల్లవారు జామున పొలానికి వెళ్లి చూడగా మృతిచెంది కనిపించడంతో కన్నీటి పర్యంతమయ్యాడు. సమాచారం తెలుసుకున్న పశువుల ఆసుపత్రి అసిస్టెంట్ సర్జన్ శ్రీనివాస్ పొలానికి చేరుకుని గేదెను పరిశీలించగా పాము కాటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. పాడిగేదె విలువ సుమారు రూ.80 వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

చేతుల పరిశుభ్రతపై అవగాహన



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్యసిబ్బంది

సిద్దిపేటకమాన్: చేతులు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విమలాథామస్, ఆసుపత్రి సూపరింటెండెంట్ కిషోర్‌కుమార్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేతుల పరిశుభ్రత, ప్రాముఖ్యతపై మైక్రోబయాలజీ విభాగ హెచ్ఓడీ, ప్రొఫెసర్ డాక్టర్ శైలజ బుధవారం అవగాహన కల్పించారు. వైద్యవిద్యార్థులు, సిబ్బంది ఫ్లాష్ మాబ్ ద్వారా పరిశుభ్రతను వివరించారు. వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓలు డాక్టర్ హేమలత, డాక్టర్ సదానందం, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



అనంతసాగర్‌లో రైతులకు విత్తనాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

చిన్నకోడూరు(సిద్దిపేట): తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, తోట ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధిలోని అనంతసాగర్‌లో రైతులకు దేశీ విత్తనాలు, రసాయన రహిత సాగు పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు మట్ట రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో రసాయన ఎరువులు తగ్గించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయాలని, భావి తరాలకు మంచి నేల, ఆరోగ్యం ఇవ్వాలన్నారు. అనంతరం రైతులకు విత్తనాలను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నరేందర్ రెడ్డి, వినీల్, పల్లెర్ల తిరుపతి, చామకూర విజయ లింగం, గంగ పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

తలంబ్రాల పంపిణీకి ఏర్పాట్లు

గజ్వేల్‌రూరల్: భద్రాచల ముత్యాల తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు తెలిపారు. భద్రాచల దేవస్థానం నుంచి వంద కిలోల ముత్యాల తలంబ్రాలు వచ్చిన సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటి రామ రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రామ కోటి సంస్థ ద్వారా గోటి తలంబ్రాల కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారని, వారందరికీ తలంబ్రాలను పంపిణీ చేస్తామన్నారు.

అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం

ఎంపీపీ లక్ష్మి అధ్యక్షతన మండల సమావేశం



సమావేశంలో అధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు లింగాల శ్రీనివాస్

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామ పంచాయతీ కార్మికులంటే మండల పంచాయతీ అధికారి (ఎంపీఓ)కు చులకన అని, ఇటీవల ఓ కార్మికుడు చనిపోతే కనీసం స్పందించలేదంటూ రామవరం గ్రామ ఎంపీటీసీ సభ్యుడు లింగాల శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశాడు. అక్కన్నపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మాలోతు లక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల రామవరం గ్రామ పంచాయతీ కార్మికుడు లింగాల కనకయ్య, మంచినీళ్ల బండ గ్రామ పరిధి యాటకార్లపల్లి ప్రభుత్వ ఉపాధ్యాయుడు లకావత్ రామన్న మృతికి సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. పంచాయతీలో పనిచేసే మల్టీ పర్పస్ వర్కర్‌లకు లేబర్ కార్డులు, బీమా చేయించాలన్న నిబంధనలను అధికారులు పట్టించుకోవడంలేదని సభలో ఎంపీటీసీ శ్రీనివాస్ అధికారులను నిలదీశాడు. ఇటీవల రామవరం పంచాయతీ కార్మికుడు చనిపోతే డీపీఓ దృష్టికి తీసుకెళ్లే వరకు అంత్యక్రియల ఖర్చు ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశాడు. లేబర్ కార్డు, బీమా చేయించకపోవడంతో కనకయ్య కుటుంబం రోడ్డుపై పడిందన్నారు. ఎంపీడీఓ భానోతు జయరాం స్పందిస్తూ మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. భగీరథ నీరు సరిగా రావడం లేదని మరో ఎంపీటీసీ సభ్యుడు పెసరు సాంబరాజు సభలో ప్రస్తావించారు. అలాగే మండల వ్యాప్తంగా 490 గొర్రెల పంపిణీకి డీడీలు తీశారని, గొర్రెలు పంపిణీ కాకపోవడంతో ఆ డీడీలన్నీ రైతులకు వాపస్ చేయించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత డీడీలు వాపస్ వస్తామని పశువైద్యాధికారి విజయ్‌భార్గవ్ బదులిచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులందరికీ లేబర్ కార్డులు, బీమా చేయించాలన్నారు. గ్రామా ల్లో తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచాలి

సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్: ఇన్సిడెంట్ ఫ్రీ ఎన్నికలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని, నిర్భయంగా ఓటువేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలని సీఐ శ్రీనివాస్ కోరారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది కలిసి హుస్నాబాద్‌తోపాటు జిల్లెల్లగడ్డలో బుధవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధమని, ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, అభ్యర్థులకు సంబంధించిన వ్యక్తులు ఓటు వేయమని బలవంతపెట్టినా, డబ్బులు ఆశచూపి ప్రలోభ పెట్టిన, అల్లర్లు, గొడవలు చేసినా వెంటనే సీ విజిల్ యాప్‌లో ఫొటోలు, వీడియోలు తీసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రజాస్వామ్య దేశంలో..

దుబ్బాకటౌన్: ప్రజాస్వామ్య దేశంలో ఓటుహక్కు వజ్రాయుధమని, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని దుబ్బాక సీఐ శ్రీనివాస్ అన్నారు. బుధవారం దుబ్బాక మండలం రాజక్కపేట, పెద్ద గుండవెల్లి, చెల్లాపూర్ గ్రామాలలో సీఆర్పీఎఫ్ కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు.



హుస్నాబాద్‌లో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

కేంద్రబలగాలతో ..

బెజ్జంకి(సిద్దిపేట): పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా బెజ్జంకి మండల కేంద్రంతో పాటు గుండారం గ్రామంలో పోలీసులు కేంద్రబలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా బెజ్జంకి ఎస్ఐ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. కవాతులో సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి, పోలీసులు, పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆదరించాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్

కొండపాక(గజ్వేల్): పేదల సంక్షేమ కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆదరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్ కోరారు. మండలంలోని దుద్దెడ, కొండపాక గ్రామాల్లో పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం కోసం ..

సిద్దిపేటకమాన్: రైతుల సంక్షేమం కోసం కృషిచేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నాయిని నర్సింహారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో రైతులందరూ కాంగ్రెస్ పార్టీ మెదక్ అభ్యర్థి నీలం మధుకు ఓటు వేయాలని కోరారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మరు

చిన్నకోడూరు(సిద్దిపేట): పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. బుధవారం కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం, సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్‌కు ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు.

కాంగ్రెస్ గెలిస్తే మరింత అభివృద్ధి

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును గెలిపిస్తే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. బుధవారం నంగునూరులో మధుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం బద్దిపడగలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రచారం నిర్వహించారు.

నీలం మధు గెలుపు పక్కా

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ మెదక్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నీలం మధు గెలుపు పక్కా అని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని సమస్యలపై నీలం మధుకు అవగాహన ఉందన్నారు. గతంలో కేసీఆర్ ప్రజల స్వేచ్ఛను హరించాడన్నారు. నేడు స్వేచ్ఛగా ఉంటున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.



దుద్దెడలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతుల నరేందర్

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో..

గజ్వేల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని గజ్వేల్ యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మన్నె కృపానందం పిలుపునిచ్చారు. బుధవారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నీలం మధుకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

సిద్దిపేటలో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు మద్దతుగా సిద్దిపేటలో పార్టీ శ్రేణులు బుధవారం ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో టీపీసీసీ సెక్రటరీ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం, టీపీసీసీ ఎస్సీ సెల్ నాయకుడు బొమ్మల యాదగిరి, టీపీసీసీ మైనార్టీ సెల్ నాయకుడు కలీమొద్దీన్ పాల్గొన్నారు.

గులాబీ జెండా ఎగరడం ఖాయం



దుబ్బాకలో ప్రచారం చేస్తున్న చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాకటౌన్: ఉద్యమాలకు ఊపిరిపోసిన మెదక్ గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని పార్లమెంట్ ఎన్నికల్లో మూడోసారి మెదక్ గడ్డ పై పార్టీ జెండా ఎగరడం ఖాయమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. బుధవారం దుబ్బాకలో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాసులాబాద్‌లో..

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ శ్రేణులు మండల పరిధిలోని కాసులాబాద్‌లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి పాల్గొన్నారు.

ధర్మారం, చాట్లపల్లి, లింగారెడ్డిపల్లిలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని ధర్మారం, చాట్లపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. కారుకు ఓటేసి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీలు కవిత, కిరణ్, మాజీ చైర్మన్‌లు రంగారెడ్డి, ఉపేందర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, మాజీ సర్పంచ్‌లు నరేష్, రాజు, నాగరాజు, కనకయ్య పాల్గొన్నారు.

బందారం, తిమ్మారెడ్డిపల్లి, సిర్సనగండ్లలో..

కొండపాక(గజ్వేల్): మండలంలోని బందారం, తిమ్మారెడ్డిపల్లి, సిర్సనగండ్ల, వెలికట్ట, ఆరెపల్లి, కుకునూరుపల్లి మండలంలోని మాత్‌పల్లి, కుకునూరుపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థికి మద్దతుగా మాజీ ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు

సిద్దిపేటరూరల్: మెదక్ ఎంపీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికే మద్దతు పలుకుతున్నారని ఆ పార్టీ మండల నాయకులు అన్నారు. బుధవారం నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని గ్రామాల్లో గ్రామ అధ్యక్షులు, ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

వర్గల్(గజ్వేల్): అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని వర్గల్ జెడ్పీటీసీ బాలమల్లుయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రం వర్గల్‌లో పార్టీ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు, ఎంపీపీ లత, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. వర్గల్‌లో ఆరబోసిన వడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి పంట సగం ఎండింది, సగం సగం పండిందని, అకాల వర్షంతో ధాన్యం తడిసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజల స్పందన చూస్తుంటే..

మర్కూక్(గజ్వేల్): గ్రామాలలో ప్రజల స్పందన చూస్తుంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపు ఖాయమని జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, ఎంపీపీ పాండుగౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణ యాదవ్, బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని కాశిరెడ్డిపల్లి, పాములపర్తి గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు.

ఆయనకే మా మద్దతు

సిద్దిపేటకమాన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు రాములు అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌గా పనిచేసిన వెంకట్రామిరెడ్డి సిద్దిపేట జిల్లాను మొదటి స్థానంలో నిలిపాడన్నారు. ఆయనకే తమ మద్దతన్నారు.

కాంగ్రెస్ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



కాంగ్రెస్‌లో చేరినవారితో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ గెలుపు కోసం ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. మండలంలోని అలిరాజ్‌పేట గ్రామ ఎంపీటీసీ రమ్య, బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కొండపాక(గజ్వేల్): అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో ఐదు గ్యారెంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన కొండపాకకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా ఆయనకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య చేరికల గిఫ్ట్ ఇచ్చారు. మండలంలోని మల్లంపల్లి గ్రామ బీఆర్ఎస్ ఎంపీటీసీ సభ్యుడు మేముల శ్రీనివాస్, మొత్కులపల్లి గ్రామ మాజీ సర్పంచ్ రాగుల సమ్మయ్య, మసిరెడ్డితండా గ్రామ మాజీ సర్పంచ్ మాలోతు బావుసింగ్, గొల్లపల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ కనకయ్యతోపాటు వివిధ పార్టీ నుంచి సుమారుగా 150 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని కర్కపట్లలో మాజీ సర్పంచ్ సుగుణాకర్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, మాజీ ఉప సర్పంచ్ అన్వర్‌తో పాటు సుమారు 150 మంది సీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బెజ్జంకి(సిద్దిపేట): రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు ఒంటెల సంపత్‌రెడ్డి తన 200 మంది అనుచరులతో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులపై బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అడిషనల్ డీఆర్డీఓ బాలకృష్ణ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023 మార్చి నుంచి 2024 మార్చి వరకు చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. అవినీతికి పాల్పడిన వారికి రూ.36,134 జరిమానా విధించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ప్రభాకర్, ఏపీడీ శివాజీ, అంబుడ్స్‌మెన్ ఆరీఫ్, ఎంపీడీఓ కుమారస్వామి, ఎంపీఓ మంజుల పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ గెలుపు కోసం ముడుపు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దౌలాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో బుధవారం మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడి భారీ మెజారిటీతో గెలవాలని అమ్మవారికి ముడుపు కట్టారు.

◆ నష్టపరిహారం అందజేయాలి

మద్దూరు(హుస్నాబాద్): మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి దెబ్బతిన్న పంటలను బీఆర్ఎస్ పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్‌కుమార్ పార్టీ నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షానికి దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20 వేలు నష్ట పరిహారం కింద అందించాలని డిమాండ్ చేశారు. ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో తడిసిందన్నారు. షరతులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు.

◆ పంటల పరిశీలన

మద్దూరు(హుస్నాబాద్): మంగళవారం కురిసిన అకాల వర్షానికి మండల పరిధిలో దెబ్బతిన్న పంటలను బుధవారం ఏఈఓ రాకేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ధర్మారం, గాగిల్లాపూర్, మద్దూర్ గ్రామాల్లో వర్షానికి నష్టపోయిన పంటలను పరిశీలించామన్నారు. వరి, మామిడి తోటలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను బుధవారం వ్యవసాయ విస్తరణాధికారులు పరిశీలించారు. అక్కన్నపేటకు చెందిన ముత్యాల సంజీవ్‌రెడ్డి మామిడి తోటలో మామిడి కాయలు నేలరాలాయి. ఆయన తోటను ఏఈఓ సబియా, జనగామలో నెలరాలిన మామిడి కాయ లు, తడిసిన ధాన్యాన్ని ఏఈఓ శ్రీలత పరిశీలించారు. పంటల నష్టంపై నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

◆ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్‌తోనే ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం దూళ్మిట్ట మండలంలోని తోర్నాల గ్రామంలో పార్టీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో కాంగ్రెస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి మద్దతుగా ఆపార్టీ నాయకుడు కొమ్మూరి రాకేష్‌రెడ్డి బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మహాదేవుని మల్లికార్జున్, మండల యూత్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం మండల పరిధిలోని ఆకునూరులో బుధవారం ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ, ఈనెల 13న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటువే సి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు తోర్ల రాజేశ్వరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాటికొండ సదానందం తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజలకు బీజేపీతోనే లబ్ధి

సిద్దిపేటరూరల్: బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి జిల్లెల్ల రమేశ్ అన్నారు. బుధవారం నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీజేపీలోలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బాబు, గ్రామ బూత్ అధ్యక్షుడు అరవింద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ నిబంధనల ఉల్లంఘనపై జరిమానా

మద్దూరు(హుస్నాబాద్): బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా విధించినట్లు మద్దూరు ఎస్సై యూనస్ అహ్మద్ అలీ బుధవారం తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అక్ర మ బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న జంగం రామస్వామిని మద్దూరు తహసీల్దార్ ఎదుట హాజరుపరిచారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు అతడికి రూ.25 వేల జరిమానా విధించారు.

◆ ఎంపీ ఎన్నికల్లో మోదీని ఓడించాలి

గజ్వేల్‌రూరల్: ప్రజాస్వామ్యాన్ని, భారత రాజ్యాంగాన్ని ప్రమాదంలో పడేసిన ప్రధాని నరేంద్ర మోదీని ఎంపీ ఎన్నికల్లో ఓడించాలని జాగో తెలంగాణ కన్వీనర్ ఆకునూరి మురళీ అన్నారు. జాగో తెలంగాణ, టీఎస్‌డీఎఫ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఓటర్ల చైతన్య బస్సుయాత్ర బుధవారం గజ్వేల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం నుంచి పన్నుల రూపంలో రూ.12 లక్షల కోట్లు వసూలు చేసి రాష్ట్రానికి నిధులు ఖర్చు చేయలేదన్నారు.

◆ విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దుబ్బాకరూరల్: కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి క్యూరింగ్ చేస్తుండగా విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం దుబ్బాక మండలం చీకోడ్‌లో జరిగింది. ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఒడ్డె వల్లెపు రాములు(55) కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో ఇంటికి క్యూరింగ్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయాడు. మృతుడి భార్య లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

◆ పేదల సంక్షేమమే ధర్మ సమాజ్ లక్ష్యం

సిద్దిపేటకమాన్: పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ధర్మ సమాజ్ పార్టీకి ఓటు వేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి అన్నెల లక్ష్మణ్‌కు మద్దతుగా బుధవారం సిద్దిపేటలో రోడ్ షో నిర్వహించారు. అనంతరం జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించేది ధర్మ సమాజ్ పార్టీయేనని అన్నారు. లక్ష్మణ్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రోళ్ల రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

◆ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశం

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిద్దిపేట నియోజకవర్గ పుల్లూర్ గ్రామానికి చెందిన మల్లేశంను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియమించారు. హైదరాబాద్‌లో బుధవారం నియామక పత్రాన్ని అందుకున్నారు.

◆ ప్రకృతితో మమేకమైతే ప్రతిధ్వని సంగీతమే

జగదేవ్‌పూర్(గజ్వేల్): చిన్నతనం నుంచి ప్రకృతి ఒడిలో మమేకమైతే ప్రతిధ్వని సంగీతమవుతుందని ప్రముఖ సంగీత విద్వాంసుడు, చిల్డ్రన్ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు రామాచారి అన్నారు. మంగళవారం రాత్రి మండల కేంద్రంలో ఎస్‌వీ ఫంక్షన్‌హాల్‌లో చిన్మయ మిషన్ చిల్డ్రన్స్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. బాల్యం నుంచి శ్లోకాలు, సంగీతం వైపు అడుగులు వేస్తే జీవితం నందనవనం అవుతుందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచితంగా తమ అకాడమీ తరుపున సంగీతం నేర్పిస్తున్నామని తెలిపారు.

◆ పేకాట స్థావరంపై దాడి

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడిచేసి బుధవారం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మున్సిపాలిటీ పరిధిలోని రాజిరెడ్డిపల్లి రోడ్డు మార్గంలోగల ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7 వేల నగదు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.